

స్కూల్ చెంతనే మద్యం షాపు

పాఠశాలకు సమీపంలో మద్యం షాపు ఉండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8లో

ఉష్ణోగ్రతలు

ఆదివారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	32.5/26.5
చోడవరం	:	36.0/25.0



వడాయితీ సంప్రోక్షణం

సింహాచలం: మిథున సంక్రమణాన్ని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వడాయితీ సంప్రోక్షణ నిర్వహించారు.

మత్స్యకారుల ఆశలు.. అడియాసలు



- అర్ధంతరంగా ఆగిపోయిన జెట్టీ నిర్మాణ పనులు ■ పైప్‌లైన్ల కారణంగా క్షీణిస్తున్న మత్స్య సంపద
- మరోవైపు ఉపాధి అవకాశాలు శూన్యం ■ ఆర్థికాభివృద్ధికి నోచుకోని జిల్లా మత్స్యకారులు

జెట్టీ నిర్మాణ పనులు పూర్తవుతాయి.. తమ జీవితాలు బాగుపడతాయి అనుకున్న పూడిమడక మత్స్యకారుల ఆశలు అడియాసలయ్యాయి. కూటమి ప్రభుత్వం రావడంతో జెట్టీ నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. మొదలు పెట్టిన ఒకటిన్నర సంవత్సరంలో పూర్తి కావాల్సిన జెట్టీ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వ రావడంతో నిలిచి పోయాయి. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలనే సదుద్దేశంతో మాజీ సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి 2023లో పూడిమడకలో జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, పనులు చేపట్టారు. సుమారు రూ.400 కోట్ల వ్యయంతో మొదలుపెట్టిన జెట్టీ నిర్మాణ పనులు ఏడాది పాటు చురుగ్గా సాగి ప్రభుత్వం మారగానే నిలిచిపోయాయి. దీంతో మత్స్యకారుల ఆశలపై నీళ్లు జల్లినట్టయింది.

అచ్యుతాపురం రూరల్: అనకాపల్లి జిల్లాలో పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లో సుమారు 50 నుంచి 60 వేల మత్స్యకార కుటుంబాలు కేవలం మత్స్య సంపదపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. తీర ప్రాంతాలైన తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, తంతడి, పూడిమడక, లోవపాలెం, వెంకయ్యపాలెం, రాంబిల్లి, వాడ నర్సాపురం, కొత్తపట్నం, బంగారమ్మపాలెం, రేవుపోలవరం, రాజయ్యపేట, తీనార్లు, దొండాక, బోగుపాడు వంటి మరెన్నో మత్స్యకార గ్రామాల ప్రజలు మత్స్య సంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరంతా పూడిమడక కేంద్రంగా జెట్టీ ఏర్పడుతుంది.. ఇకనైనా తమ జీవితాలు బాగుపడతాయనుకున్నారు.

ప్రాణాలు పణంగా పెట్టి సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు తిరిగి ఇంటికి చేరుకునే వరకూ సముద్రంతో యుద్ధం చేస్తూనే ఉంటారు. రోజుల తరబడి సముద్రంపైనే ఉంటూ క్షణం ఒక గండంగా ఆటుపోట్ల మధ్య తీవ్ర క్లిష్ట పరిస్థితిలో వేట సాగిస్తారు. జెట్టీ ఉన్నట్టయితే పెద్ద బోట్ల సాయంతో నెలల తరబడి సముద్రంలో వేట సాగించి, తీరంలో సులభంగా నిలకడ చేసుకునేందుకు వీలు కుదురుతుంది. తద్వారా అధికంగా చేపలవేట జరపడానికి అనుకూలంగా ఉంటుందన్న మత్స్యకారులు ఆశలు కూటమి ప్రభుత్వంలో అడియాసలయ్యాయి. ఆర్థికంగా స్థిరపడే అవకాశాలు కోల్పోవడం మత్స్యకారులను మానసికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది.

ఆర్థికాభివృద్ధికి దోహదం

జెట్టీ నిర్మాణం జరిగితే మత్స్యకారులు ఆర్థికంగా స్థిరపడతారు. మత్స్య సరఫరా కూడా పెరుగుతుంది. దానికి అనుబంధంగా ఐస్ ఫ్యాక్టరీలు, థర్మాకోల్ బాక్స్ పరిశ్రమలు ఇలా పలు రకాల కుటీర పరిశ్రమలు ఎన్నో స్థాపితమవుతాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కేవలం పూడిమడక గ్రామమే కాకుండా చుట్టుపక్కల ఎన్నో గ్రామాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు వంటివి ఏర్పాటవుతాయి. వాణిజ్య సముదాయాలు మెరుగుపడతాయి. పూర్తిగా మత్స్యకారుల జీవన విధానం మారుతుంది. ఈ నేపథ్యంలో నిలిపివేసిన జెట్టీ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు.



జెట్టీ నిర్మాణం చేపట్టాలని ఆందోళన చేస్తున్న మత్స్యకారులు



జెట్టీ లేక మొగ ప్రాంతంలో నిలిపిన చిన్న బోట్లు

నిత్యం గండాలు..

మత్స్యకారులు నడి సముద్రంలోకి వెళ్లాక ఎప్పుడైనా ప్రమాదవశాత్తూ తుపానులో చిక్కుకుంటే పడవలో ఎవరైనా సాంకేతికత పరంగా అవగాహన ఉన్న వారు ఉంటే ఒకింత ఫరవా లేదు. కానీ, సాంకేతికతపై అవగాహన లేని వారు వేటకు వెళ్లినట్టయితే తీరం వైపు కాకుండా పొరపాటున తీరానికి వ్యతిరేక దిశగా వెళ్తే వారు ఇక సముద్రంలో గల్లంతైనట్టే. దూరం వెళ్లే కొద్దీ బోట్లలో ఆయిల్ అయిపోతుంది, వారు తినడానికి తీసుకువెళ్లిన ఆహారం నిండుకుంటుంది. అదృష్టవశాత్తూ ఏదైనా పెద్ద బోట్లు తారసిల్లితే తప్ప వారు బతికి బయటపడే అవకాశం చాలా తక్కువ. ఇటువంటి పరిస్థితుల్లో మత్స్యకారులు తమ ప్రాణాలు పణంగా పెట్టి వేట కొనసాగిస్తుంటారు.

జెట్టీ నిర్మిస్తే మా బతుకుల్లో వెలుగు



గత 6 నెలలుగా సబ్సిడీ డీజిల్ ఆయిల్ బంక్ మూత పడడంతో మత్స్యకారులకు బోట్లలో ఉపయోగించే డీజిల్ ఆయిల్‌పై కూడా అధిక భారం పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మారినప్పటి నుంచి జెట్టీ నిర్మాణ పనులు చేపట్టలేదు. దెబ్బ మీద దెబ్బ పడతుండడంతో ఆర్థికంగా ఎదగలేని పరిస్థితి పూడిమడక మత్స్యకారుల్లో నెలకొంది. జెట్టీ నిర్మాణం పూర్తి అయితే పూడిమడకలో వ్యాపారాలు పెరిగి గ్రామస్తులందరూ ఆర్థికంగా స్థిరపడే అవకాశం ఉండేది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేందుకు జెట్టీ నిర్మాణ పనులు చేపట్టాలని కోరుకుంటున్నాను.

–ఉమ్మిడి అప్పారావు, పూడిమడక మత్స్యకార నాయకుడు

పైప్‌లైన్ల కారణంగా మత్స్య సంపదకు విఘాతం



బ్రాండిక్స్, ఏపీఐఐసీ పైప్‌లైన్ వేయడంతో సముద్ర తీరం నుంచి కిలోమీటర్ల మేర జలాలు వ్యర్థ రసాయనాల కారణంగా కలుషితమైపోవడంతో మత్స్య సంపద తగ్గిపోతోంది. మత్స్యకారులు వందల మైళ్ల దూరం వేటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లి వేట సాగించవలసి వస్తుంది.మత్స్యకారులకు ప్రభుత్వాలు రాయితీలు కల్పించడమే కాకుండా జెట్టీ నిర్మిస్తే కష్టానికి తగిన ఫలితం లభిస్తుంది.

–చోడిపల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

కలుషిత ఆహారం తిని భక్తులకు తీవ్ర అస్వస్థత

- పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు
- ఆరోగ్యం మెరుగుపడటంతో డిశ్చార్జ్





పాడేరు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

పాడేరు : కలుషిత ఆహారం తిన్న 14 మంది భక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం అల్లూరి జిల్లా పాడేరు ఘాట్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నాతవరం ప్రాంతానికి చెందిన 20 మంది భక్తులు ఆదివారం పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మ అమ్మవారి పాదాలను దర్శించుకునేందుకు వచ్చారు. ఇంటివద్ద తయారుచేసి తీసుకువచ్చిన పులిహోర తినడంతో 14 మంది అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులతో బాధపడుతున్న వారిని హుటాహుటిన స్థానిక సర్వజన ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంటనే వారికి వైద్యసేవలు కల్పించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో 14 మందిని డిశ్చార్జ్ చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు.

నీట్‌లో మామిడిపల్లి విద్యార్థి ప్రతిభ



పోతల భానుచందు

దేవరాపల్లి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్‌లో మండలంలో మామిడిపల్లి గ్రామానికి చెందిన పోతల భానుచందు ప్రతిభ చూపాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో 528 మార్కులు సాధించి, 25,241 ర్యాంక్ పొందాడు. తల్లిదండ్రులు ఈశ్వరావు, చెల్లయ్యమ్మ వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుమారుడుతో పాటు కుమార్తెను చదివిస్తున్నారు. భానుచందు ఇంటర్‌లో 980 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా భానుచందు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా బాగా చదివి మంచి వైద్యుడుగా పేరు సంపాదించుకుంటానని తెలిపారు.

బదిలీ అయిన ఎస్జీటీలు నేడు పాఠశాలల్లో చేరాలి

ఆరిలోవ(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు వారికి కేటాయించిన కొత్త స్థానాల్లో సోమవారం చేరాలని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఈనెల 10 నుంచి 14 వరకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 2,782 మంది ఎస్జీటీలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా.. వారిలో అర్హతను బట్టి 2,461 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ చేసినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ విజయవంతం చేసిన ఉమ్మడి విశాఖ జిల్లాల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యోగాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి



యోగాసనాలు వేస్తున్న సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు

తుమ్మపాల: రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి ఎస్.వి.రమణ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సెలబ్రిటీ యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు మంగయ్య, యోగా శిక్షకులు జ్యోతి, లక్ష్మి అందరితో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా డీఐపీఆర్వో రమణ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈకార్యక్రమంలో ఏషియన్ బ్రాంజ్ మెడలిస్ట్ బాక్సర్ కుసుమ, సహాయ సమాచార ఇంజినీర్ బాలాజీ, జూనియర్ సహాయకులు పి.డి.ఎస్.ఎన్. మూర్తిపాల్గొన్నారు.

పోస్టింగ్ కోసం ప్రదక్షిణలు

- వైద్య ఆరోగ్య శాఖలో సిఫార్సుల జోరు
- 19 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- సిటీలో పోస్టింగుల కోసం రూ.లక్షల్లో బేరాలు?
- ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు వచ్చేందుకు యత్నాలు

మహారాణిపేట(విశాఖ): ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ వేగవంతమైంది. ఈ నెల 19వ తేదీని తుది గడువుగా నిర్ణయించడంతో కీలకమైన, అనుకూలమైన పోస్టింగులను దక్కించుకోవడానికి వైద్యులు, అధికారులు, సిబ్బంది రాజకీయ పైరవీలను ముమ్మరం చేశారు. నగరంలో పాతుకుపోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ బదిలీల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే నగరంలోని కీలక స్థానాల్లో ఉన్న వైద్యులు తమ సీట్లను వదులుకోవడానికి ఇష్టపడటం లేదు. ఆరోగ్య సమస్యలను సాకుగా చూపి ఇక్కడే ఉండడానికి ప్రయత్నిస్తున్నారు. కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్యశాల, రాణి చంద్రమణి దేవి ఆర్థోపెడిక్ ఆస్పత్రి వంటి ప్రధాన టీచింగ్ ఆస్పత్రుల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అలాగే వైద్య ఆరోగ్య శాఖలో సూపరింటెండెంట్లు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులు, ఇతర అధికారులు సిఫార్సు లేఖల కోసం తమ ప్రయత్నాల్లో నిమగ్నమై ఉన్నారు. నగరంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారు ఏదో సాకుతో ఇక్కడి నుంచి వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో జోన్ పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారు నగరంలో పోస్టింగ్ దక్కించుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. అల్లూరి జిల్లా నుంచి నగరంలోకి రావడానికి కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి భారీగా సిఫార్సు లేఖలు వచ్చినట్లు తెలుస్తోంది. అనకాపల్లి జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల నుంచి నగర పరిధిలోకి రావడానికి పోస్టింగ్‌లకు ఎంత ఖర్చు చేయడానికి సిద్ధమవుతున్నట్లు వైద్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. విశాఖలో పని చేస్తున్న వైద్యులను ఏజెన్సీకి పంపడం, అక్కడ పని చేస్తున్న వారిని, అనకాపల్లిలో పనిచేస్తున్న వారిని విశాఖకు తీసుకురావడంపై కూడా చర్చ జరుగుతోంది. అలాగే విశాఖలో పనిచేస్తున్న పలువురు వైద్యులను ఇతర ప్రాంతాలకు పంపాలని డీఎంహెచ్‌వో, ఆర్డీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

తెరవెనుక మంత్రాంగాలు

వాస్తవానికి ఈ బదిలీల ప్రక్రియను జూమ్ కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంది. కానీ ఆశావహులు కూటమి ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల వ్యక్తిగత సహాయకులు, కుటుంబ సభ్యులతో బేరసారాలకు దిగుతున్నారని, పోస్టింగులను బట్టి ధర నిర్ణయించి, డబ్బు చేతులు మారాకే సిఫార్సులు అందుతున్నాయని బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి కార్యాలయాలకు ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి భారీ సంఖ్యలో సిఫార్సు లేఖలు అందినట్లు సమాచారం. కేజీహెచ్‌లో 59 మంది, డీఎంహెచ్‌వో పరిధిలో 284 మంది, ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 979 మంది ఐదేళ్లు దాటిన వారు, రిక్వెస్ట్ లేఖలు పంపిన వైద్యులు, ఉద్యోగులు, అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొని నిబంధనల ప్రకారం బదిలీలు పూర్తి చేయడం అధికారులకు కత్తి మీద సాములా మారింది.



తీర ప్రాంతాల్లో సందడి 8లో

ఏడాదిలోనే రూ.1.5 లక్షల కోట్ల అప్పు

- సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- అక్రమ కేసులతో అరాచకం
- మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



కూటమి ఏడాది పాలనలో జరిగిన అరాచకాలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గాల సమన్వయకర్తలు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పాలనలో రూ.1.5లక్షల కోట్లు అప్పు చేసిందని, సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయడంలో, పాలనలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు.కూటమి ఏడాదిపాలనలో రాష్ట్రంలో చేసిన అరాచకాలపై ముద్రించిన జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏడాది పాలనలో 766 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశారని, వీరిలో 390 మంది హత్యకు గురయ్యారని చెప్పారు. 203 మంది మహిళలు, చిన్నారులు దాడులు, హత్యాచారాలకు గురయ్యారని, 2,466 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. 729 మంది సోషల్ మీడియో యాక్టివిస్టులపై, 63 మంది పాత్రికేయులపై, 73 మంది ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. 11 మంది పాత్రికేయులపై దాడులు చేశారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ప్రజలు పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మన రాష్ట్రంలో అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చిన ప్రతి వ్యక్తిపై కూటమి నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడం అన్యాయమని, ప్రజలు త్వరలో వారికి బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్నాడు జిల్లాలో పార్టీకి సేవ చేసినందుకు టీడీపీ నాయకులు ఆ వ్యక్తిని నడిరోడ్డుపై హత్యచేసినప్పటికీ అక్కడ పోలీసులు పట్టించుకోలేదని తెలిపారు. హత్యకు గురైన వ్యక్తి కుటుంబాన్ని మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించి, అండగానిలబడినట్టు చెప్పారు. రాష్ట్రంలో పూర్తిగా శాంతిభద్రతలు గాడి తప్పాయన్నారు.

40 శాతం మందికే తల్లికి వందనం

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకానికి తల్లికి వందనంగా పేరు మార్పు చేసి, రూ.13వేలు ఇచ్చి మిగిలిన రూ.2వేలు టీడీపీ నాయకులు దోచుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో 82లక్షల మంది విద్యార్థులుండగా, 62 లక్షల మంది మాత్రమే ఉన్నారని టీడీపీ నాయకులు చెబుతున్నారని, వారిలో కూడా 40శాతం మందికి మాత్రమే పథకం వర్తింపజేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పంచాయతీ నిధులను సీఎం చంద్రబాబు మళ్లించారని చెప్పారు. నిరుద్యోగ భృతి, ప్రతి మహిళలకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో దేవుడికే తెలియాలన్నారు. జిల్లాలో కొండలను పిండి చేస్తూ ఓ ఎంపీ దోచుకుంటున్నారని ఆరోపించారు. లారీలు అధిక లోడుతో ప్రయాణించడం వల్ల జిల్లాలో ప్రమాదాలు జరిగి, ప్రజలు మరణిస్తున్నారని చెప్పారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు. 2019–2020 ఏడాది వైఎస్సార్‌సీపీ పాలనలో 89శాతం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు చెప్పారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలపై వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఇప్పటికైనా కక్షపూరిత రాజకీయలు మానుకుని సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యలమంచిలి, నర్సీపట్నం, పాయకరావుపేట, పెందుర్తి నియోజకవర్గాల సమన్వయకర్తలు ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబు), పెట్ల ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి విశాఖ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, జెడ్పీ వైస్‌చైర్మన్ బి.వి.సత్యవతి, జెడ్పీ కోఆప్షన్‌సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్ రాజా, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ రాష్ట్ర మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లెల సాయికిరణ్, నియోజకవర్గ యువజ విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80,84 వార్డుల ఇన్‌చార్జ్‌లు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కె.పద్మకుమారి, జిల్లా ఎస్సీ ఎస్టీసెల్ అధ్యక్షుడు సోలం రమేష్, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, కశింకోట ఎంపీపీ కలగగున్నయ్య నాయుడు, పార్టీ నాయకులు పి.డి.గాంధీ, ఉగ్గిన అప్పారావు, కొణతాల మురళీకృష్ణ, దాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- భారీగా జనం తరలింపునకు చర్యలు
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే బీచ్‌రోడ్డుకు రావాలి
- విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ): బీచ్‌రోడ్డులో ఈ నెల 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. బీచ్‌రోడ్డులో యోగా దినోత్సవం ఏర్పాట్లపై నగర ప్రజాప్రతినిధులతో ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ వివరాలు వెల్లడించారు. ప్రజలు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేసిన బస్సులు, ఆటోలు, టాటా మ్యాజిక్ వంటి వాహనాల్లో మాత్రమే ప్రయాణించి బీచ్‌రోడ్డులోని తమకు కేటాయించిన ప్రాంతానికి చేరుకోవాలని, ప్రైవేట్ వాహనాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

ప్రజల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన, గుర్తించిన ప్రాంతాలకు ప్రజలను సకాలంలో తరలించడం ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. ఆయా నియోజకవర్గాల నుంచి ఉదయాన్నే బస్సులు బయలుదేరేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రతి వార్డు సచివాలయానికి కేటాయించిన ప్రాంతం గురించి ఇప్పటికే సమాచారం అందించామని, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుని ప్రజలు తెల్లవారుజామున ఆ ప్రాంతానికి చేరుకునేలా చూడాలని కోరారు. బస్సులకు వార్డు సచివాలయం కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నామని, పికప్, డ్రాపింగ్ పాయింట్ల వివరాలతో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

2,185 బస్సులు సిద్ధం

ప్రజలను తరలించేందుకు జిల్లాలో మొత్తం 2,185 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో 1,300 ఆర్టీసీ బస్సులు (పట్టణ ప్రాంతాలకు 800, గ్రామీణ ప్రాంతాలకు 500), 885 ప్రైవేట్ బస్సులు ఉంటాయని తెలిపారు. వీటికి అదనంగా ఆటోలు, టాటా ఏస్, మ్యాజిక్ వంటి వాహనాల్లో కూడా తరలింపు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ బస్సులన్నీ జూన్ 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకే ఆయా నియోజకవర్గాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్యేలు

ఉచితంగా టీ షర్ట్‌లు, మ్యాట్‌లు, స్నాక్స్

యోగా కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ ఉచితంగా టీ షర్ట్‌లు, మ్యాట్‌లు అందజేస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత తిరిగి వెళ్లేటప్పుడు అందరికీ స్నాక్స్ ప్యాకెట్లు అందిస్తామన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే వారికి ఆయా జిల్లాల యంత్రాంగం అల్పాహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

పార్కింగ్ కేటాయింపులు

విశాలాక్షినగర్ వరకు ఉన్న బీచ్‌రోడ్డును నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు కేటాయించారు. పెందుర్తి, అనకాపల్లి ప్రాంతాల వారికి లా కాలేజ్ రోడ్డు, విజయనగరం జిల్లా వారికి మధురవాడ ఐటీ సెజ్ ప్రాంతం, శ్రీకాకుళం వారికి తిమ్మాపురం నుంచి భీమిలి వరకు మార్కింగ్ చేశారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో 600 మంది పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రధాని ఈ నెల 21న ఉదయం 6.30 గంటలకే బీచ్‌రోడ్డులోని వేదిక వద్దకు చేరుకుని కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముందురోజు నగరానికి చేరుకుంటారని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్ రాజు, పి.గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు 32 మంది



పోటీలకు బయలుదేరిన సభ్యులు

తుమ్మపాల: యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 32 మంది సభ్యుల బృందం హాజరు కానున్నట్టు జిల్లా క్రీడల శాఖ అధికారి ఎల్.వెంకటరమణ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో ఈ నెల 16 నుంచి జూనియర్స్, యంగ్, సీనియర్స్ విభాగాల్లో సోలో యోగా, గ్రూప్ యోగా, చిత్ర లేఖనం, పాటలు, పోస్టర్ డిజైన్, వ్యాసరచన తదితర పోటీలు జరుగుతాయని చెప్పారు. జిల్లా నుంచి ఐదుగురు బాలురు, 23 మంది మహిళలు, నలుగురు అఫీషియల్ సభ్యులు హాజరవుతున్నట్టు తెలిపారు. వీరు మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 20న విశాఖపట్నంలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంటుందన్నారు.



అరుదైన ప్రాణులకు ఊపిరి

జూలో అంతరించిపోతున్న జాతుల పునరుత్పత్తి

8 నెలల్లో 46 ప్రాణులకు జన్మనిచ్చిన వన్యప్రాణులు

ఆరిలోవ: వాతావరణ కాలుష్యం, వేటగాళ్ల ఉచ్చులు, క్రూర మృగాల దాడి, మారుతున్న పర్యావరణ పరిస్థితుల కారణంగా ఎన్నో వన్యప్రాణి జాతులు అంతరించిపోయే దశకు చేరుకుంటున్నాయి. ఒకప్పుడు సజీవంగా ఉన్న జాతులు నేటి తరానికి టీవీల్లో, పుస్తకాల్లో మాత్రమే కనిపించే పరిస్థితి నెలకొంది. వాటి ఉనికే ప్రశ్నార్థకమవుతున్న ఈ తరుణంలో నగరంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కు ఒక ఆశాకిరణంగా నిలుస్తోంది. అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణులకు పునరుత్పత్తి కేంద్రంగా మారి, వాటి వంశాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇక్కడి సంరక్షకుల కృషితో గత ఎనిమిది నెలల్లోనే 12 అంతరించిపోతున్న జాతులకు చెందిన 46 పిల్లలు జన్మించి.. వన్యప్రాణి సంరక్షణలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాయి.







అరుదైన జీవులకు అభయం







విశాఖ జూ పార్కు ఇప్పుడు కేవలం జంతు ప్రదర్శనశాల మాత్రమే కాదు.. అంతరించిపోతున్న జీవజాతులకు ఒక సురక్షితమైన ఆవాసం, పునరుత్పత్తి కేంద్రం. వన్యప్రాణి సంరక్షణ చట్టం -1972 ప్రకారం షెడ్యూల్-1 జాబితాలోని అనేక జీవులు ఇక్కడ విజయవంతంగా తమ సంతతిని పెంచుకుంటున్నాయి. జింక పిల్లలు, అడవి దున్నలు, అడవి కుక్కల పిల్లలు, నీల్‌గై, రెడ్‌నెక్ వాలబీ, బెంగాల్ ఫాక్స్, ఇండియన్ గ్రే వోల్ఫ్, రింగ్‌టైల్డ్ లెమూర్స్ వంటి జాతులకు చెందిన చిట్టి ప్రాణులు తమ ఎన్‌క్లోజర్లలో తల్లుల వెంట ఉత్సాహంగా తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. ఈ అద్భుతమైన దృశ్యాలు జూకి వచ్చే వారికి కనువిందు చేయడమే కాకుండా, అంతరించిపోతున్న జాతులను పరిరక్షించడం ఎంత అవసరమో తెలియజేస్తున్నాయి. వెటర్నరీ వైద్యులు, యానిమల్ కీపర్ల నిరంతర పర్యవేక్షణలో ఈ అద్భుతం సాధ్యమైంది.

8 నెలలు.. 46 బుల్లి ప్రాణులు

గడిచిన ఎనిమిది నెలల కాలంలో ఇందిరా గాంధీ జూ పార్కులో 12 రకాల వన్యప్రాణులకు చెందిన 46 పిల్లలు పుట్టాయి. ఇందులో అడవి కుక్కలు-14, కృష్ణ జింక (రాష్ట్ర జంతువు) -9, చుక్కల జింక-7, కనుజు-5, నీల్ గై-3, బార్కింగ్ డీర్-2, మౌస్ డీర్-1, బెంగాల్ ఫాక్స్-1, ఇండియన్ గ్రే వోల్ఫ్-1, అడవి దున్న (బైసన్)-1, రెడ్-నెక్డ్ వాలబీ-1, రింగ్-టెయిల్డ్ లెమూర్-1 ఉన్నాయి.







అంతరించిపోతున్న జాతుల విశేషాలివి..

ఈ జూలో పునరుత్పత్తి అవుతున్న కొన్ని ముఖ్యమైన అంతరించిపోతున్న జాతులు, వాటి ప్రత్యేకతలు ఇప్పుడు తెలుసుకుందాం..

- **అడవి కుక్కలు(ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్):** ఇవి వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని షెడ్యూల్-1 కిందకు వస్తాయి. ఇందిరా గాంధీ జూ పార్కులో వీటి పునరుత్పత్తి కేంద్రం ఉంది. వీటి ఎత్తు సుమారు 50 సెం.మీ., శరీరం పొడవు 90 సెం.మీ., తోక పొడవు 40-45 సెం.మీ. ఉంటుంది.
- **కృష్ణ జింక(బ్లాక్‌బక్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జంతువుగా గుర్తింపు పొందిన ఈ జింకలు, తమ మెలితిరిగిన కొమ్ములతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కృష్ణ జింక షెడ్యూల్-1 జాబితాలో ఉంది
- **మూషిక జింక(మౌస్ డీర్):** షెడ్యూల్-1 జాబితాలోని ఈ జింక శరీరం పొడవు 50-60 సెం.మీ., బరువు 3-4 కిలోలు ఉంటుంది. ప్రపంచంలోని అతి చిన్న జింక జాతులలో ఇది ఒకటి. చూడటానికి చిన్నగా, సున్నితంగా ఉండే ఈ జీవి కూడా షెడ్యూల్-1 జాబితాలో ఉంది.
- **కనుజు :** ఇది కూడా షెడ్యూల్-1 జాబితాలో ఉంది. మగ కనుజులకు చెట్ల కొమ్మల మాదిరిగా ఉండే కొమ్ములు 3.5 అడుగుల పొడవు వరకు పెరుగుతాయి.
- **నీలి ఎద్దు(నీల్‌గై):** ఆసియా జింక జాతులలో అతి పెద్దదైన నీల్‌గై షెడ్యూల్-2 జాబితాలో ఉంది. దీని గొంతు భాగం తెల్లగా ఉంటుంది. మగ నీల్‌గైకి 13 సెం.మీ. జుట్టు ఉంటుంది. ఆడవి 200 కిలోలు, మగవి 250 కిలోల వరకు బరువు వరకు పెరుగుతాయి.
- **రెడ్-నెక్డ్ వాలబీ:** ఈ జాతి జీవుల పునరుత్పత్తి ఎంతో ఆసక్తికరం. రెడ్‌నెక్డ్ వాలబీ గర్భం దాల్చిన 30 రోజుల్లో పిల్లకు జన్మిస్తుంది. తర్వాత ఆ పిల్ల తల్లి పొట్ట కింద సంచిలో సుమారు 7 నెలల పాటు పెరిగి, తల్లి పాలు తాగుతుంది. 12 నెలల తర్వాత స్వతంత్రంగా జీవించడం మొదలుపెడుతుంది.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



జూ పార్కులో వన్య ప్రాణుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇటీవల పునరుత్పత్తి అయిన పలు రకాల జాతుల పిల్లలను ఇక్కడ సంరక్షకులు, జూ వెటర్నరీ వైద్యులు, సిబ్బంది, యానిమల్ కీపర్లు ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్నారు. జూలో అంతరించిపోతున్న జాతుల సంతతి గణనీయంగా పెరుగుతోంది. ఈ జంతువులన్నీ వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం వీటికి ఎలాంటి హాని కలిగించినా చట్టరీత్యా నేరమవుతుంది. – జి.మంగమ్మ, జూ క్యూరేటర్

బుచ్చెయ్యపేట ఎంపీడీవో ఆరోగ్యం విషమం



విశాఖ ఆస్పత్రిలో ఎంపీడీవో విజయలక్ష్మి

బుచ్చెయ్యపేట: ఎంపీడీవో వి. విజయలక్ష్మి ఆరోగ్యం విషమంగానే ఉంది. శనివారం ఆమె బుచ్చెయ్యపేటలో విధులకు హాజరై సాయంత్రం ఇంటికెళ్లారు. రాత్రి తన ఇంట్లో బాత్‌రూమ్‌లో కాలు జారి కింద పడిపోయారు. తలకు గాయమవడంతో కోమాలోకి వెళ్లిపోయారు. విశాఖలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇంకా ఆమె కోమాలో నుంచి బయట పడలేదు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరో ఆరు నెలల్లో పదవీ విరమణ చేయనున్న ఆమె అకస్మాత్తుగా ఆస్పత్రి పాలవడంతో పంచాయతీ సెక్రటరీలు, మండల పరిషత్ సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఎంపీడీవో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విజయలక్ష్మి భర్త మల్లికార్జునరావు పార్వతీపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు.

పెళ్లయిన నెల రోజులకే మృత్యు ఒడికి..

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం



వివాహ సమయంలో సాయి, శాలిని



విగత జీవులుగా భార్యాభర్తలు శాలిని, సాయి

గాజువాక: వివాహమైన నెల రోజులకే ఒక జంట మృత్యు ఒడికి చేరింది. కాళ్ల పారాణి ఆరకముందే విధి ప్రమాద రూపంలో కబళించింది. నగరంలో సరదాగా షికారు చేసి వద్దామనుకొని బయల్దేరిన కొత్త జంట రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు అందించిన వివరాలివి..

కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన జొన్నాడ సాయి(27), పెదగంట్యాడ మండలం గంగవరం గ్రామానికి చెందిన శాలిని (25) గాజువాకలోని యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ ప్రేమించుకొని నెల రోజుల కిందట పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం శ్రీహరిపురంలో ఒక అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం ల్యాబ్‌కు సెలవు కావడంతో షికారు కోసం నగరంలోకి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ములగాడ మీదుగా పోర్టు రోడ్‌లోని మారుతీ సర్కిల్ వద్ద వెనుకనే వస్తున్న ఒక ట్రాలర్ వారిని ఢీకొని ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో సాయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్ర గాయాలపాలైన శాలినిని షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స ప్రారంభించే సమయానికి మృతి చెందిందని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఇదే రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ కింద పడి ఇద్దరు నేవీ వైద్యులు దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే.. 24 గంటల వ్యవధిలో నలుగురు మృత్యువాత పడటం.. వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది.

బోసిపోయిన చాపరాయి



చాపరాయి జలపాతం వద్ద అరకొరగా పర్యాటకులు

డుంబ్రిగుడ: మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం ఆదివారం పర్యాటకులు రాక బోసిపోయింది. గత రెండు, మూడు వారాలుగా వందల సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో సందడిగా ఉండేది. ఈవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో పర్యాటకుల రాక తగ్గిపోయింది. దీని ప్రభావం అనుబంధ రంగాలపై చూపింది. బేంబూ చికెన్, బేంబూ బిర్యానీ అమ్మకందారులు ఆదాయం కోల్పోయారు.

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య



జంప మహిమా చంద్ (ఫైల్)

అనకాపల్లిటౌన్: తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో మళ్లవీధికి చెందిన జంప మహిమ చంద్(17) అనే బాలిక ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మూడు సబెక్టులు తప్పింది. అయితే రోజూ ఉదయం లేటుగా నిద్ర నుంచి లేస్తుండడంతో తండ్రి మందలించాడు. దీంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ప్రేమ్‌చంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ ఈశ్వరరావు తెలిపారు.

2 కిలోమీటర్లు.. 12 కంపార్ట్‌మెంట్లు..!

- కాళీమాత టెంపుల్, పార్క్ హోటల్ మధ్య 'యోగాంధ్ర ప్రధాన వేడుక'
- వర్షం పడితే ప్రధాన వేదిక.. ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్‌కు మార్పు
- ప్రధాన వేదిక కార్యక్రమం ఏర్పాట్లపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ సమీక్ష

ఎంవీపీకాలనీ : యోగాంధ్ర కార్యక్రమానికి సమయం సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై దృష్టిసారించారు. ప్రధాన వేదికతో పాటు మేజర్‌గా కార్యక్రమాన్ని నిర్వహించనున్న బీచ్‌రోడ్డులో పరిస్థితులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి పార్క్ హోటల్ వరకు విస్తరించిన ప్రాంతంలో ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నారు. 2 కి.మీ.. 12 కంపార్ట్‌మెంట్‌లుగా ఈ ప్రాంతాన్ని విభజించారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో వెయ్యి మంది ఉండేలా కార్యాచరణ రచించారు. ప్రధానంగా ఈ 12 కంపార్ట్‌మెంట్ల్లో 15 వేల మంది వరకు ఉండనున్నారు. కాళీమాత ఆలయం వద్ద ఏర్పాటు కానున్న వేదికపై ప్రధాని పాల్గొనున్నారు. ఒక వేళ వర్షం పడితే ప్రధాన వేదికను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోకి మార్పు చేయనున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు అక్కడ వేగంగా జరుగుతున్నాయి. ప్రధాన వేదిక ఇన్‌చార్జి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదివారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. కంపార్ట్‌మెంట్ల ఇన్‌చార్జులు, ఇతర అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ ఆఫీసర్

ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక గెజిటెడ్ ఆఫీసర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమిస్తున్నారు. దీంతో పాటు 10 మంది వలంటీర్లు ఆ కంపార్ట్‌మెంట్‌లో ఉంటారు. 3 కంపార్ట్‌మెంట్‌లను అనుసంధానం చేస్తూ 20 బెడ్లతో కూడిన వైద్య శిబిరాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో పాటు తాగునీరు, శానిటేషన్, పోలీసులు ఇలా ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో అందుబాటులో ఉంటారు. కంపార్ట్‌మెంట్‌లకు ప్రజలు చేరుకున్న అనంతరం వారికి టీషర్ట్, క్యూఆర్ కోడ్ వివరాలు అందజేస్తారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ వారు సాంకేతికత సాయంతో లెక్కింపు చేసేలా ఏర్పాటు చేశారు.

పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

కాళీమాత ఆలయం నుంచి పార్క్ హోటల్ వరకు 2 కి.మీ పరిధిలో నిర్వహించే ప్రధాన కార్యక్రమంలో పాల్గొనే వీఐపీల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీఎంఆర్‌డీఏ డెక్, ఏయూ ఫుట్‌బాల్ మైదానంలో వాహనాలను పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. వారిని అక్కడి నుంచి ఏపీ ఐజీసీ మైదానానికి ప్రత్యేక వాహనాల్లో తరలిస్తారు. ఉదయం 4.30కు వీఐపీలు అంతా వీఎంఆర్‌డీఏకు చేరుకోవాలని ఆదేశాలిచ్చారు.

హైస్కూల్ చెంతనే మద్యం షాపు

- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- వేరే చోటకు మార్చాలని చౌడువాడ గ్రామస్తుల డిమాండ్



మద్యం షాపును తరలించాలని సర్వసభ్య సమావేశంలో కోరుతున్న ఎంపీటీసీ(ఫైల్)



పశ్చిమ వైపున హైస్కూల్ తరగతి గదులకు ఫర్లాంగు దూరంలో మద్యం షాపు

కె.కోటపాడు: పాఠశాలకు ఫర్లాంగు దూరంలోనే మద్యం షాపు ఉండటం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని మరో చోటకు తరలించాలని పలుమార్లు ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండలంలోని చౌడువాడలో జెడ్పీ హైస్కూల్ పశ్చిమ వైపున 40 మీటర్ల దూరంలోనే మద్యం షాపు ఉంది. ఇక్కడ మద్యం కొనుగోలుదారులుతో ఉదయం, మధ్యాహ్నం తీవ్ర రద్దీగా ఉంటోంది. మద్యం షాపు ఉన్న మార్గంలోనే చౌడువాడ, బంటువారి కళ్లాలు, పాచిలవానిపాలెం, పైడంపేట గ్రామాల నుంచి రోజూ విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో మందుబాబులు అనుచితంగా ప్రవర్తించడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈ నెల 11న కె.కోటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మద్యం షాపును మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. గతంలోనూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు గళమెత్తారు. వీటితోపాటు పాఠశాల పేరెంట్స్ కమిటీ సమావేశంలోనూ మద్యం షాపు వేరే చోటకు మార్పు చేయాలని అప్పటి హెచ్‌ఎం అప్పారావు తీర్మానం చేశారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వాస్తవానికి తూర్పు వైపు హైస్కూల్ గేటును ప్రామాణికంగా తీసుకుని ఎక్సైజ్ అధికారులు ఇప్పుడు ఉన్న స్థానంలో మద్యం షాపు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. పాఠశాల పశ్చిమ వైపు తరగతి గదుల్లోనే విద్యార్థులకు బోధిస్తున్నారు. దాంతో విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా మద్యం షాపును వేరే చోటకు మార్పు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

పొలాల్లో మద్యం సీసాలతో ప్రమాదాలు

మద్యం షాపు నుంచి పైడంపేట, పాచిలవానిపాలెం వెళ్లే మార్గాల్లో రాత్రిళ్లు యువకులు, ఇతరులు మందు పార్టీలు చేసుకుంటున్నారు. మద్యం సేవించిన తర్వాత ఈ గ్రామాల వైపు వెళ్లే పొలాల్లో ఖాళీ సీసాలను పారేస్తున్నారు. వాటి పెంకులు గుచ్చుకుని రైతులకు గాయాలవుతున్నాయి. దాంతో ఖాళీ సీసాలు, పెంకులు ఏరివేతకు కూలీలకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

షాపును వేరే ప్రాంతానికి తరలించాలి



రోడ్డుకు సమీపంలో మద్యం షాపు ఉంది. ఈ మార్గంలో పలు గ్రామాల విద్యార్థులు హైస్కూల్‌కు వెళ్తారు. ఈ మార్గంలో మహిళలు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఆ సమయంలో వారు పడుతున్న ఇబ్బందులపై మండల పరిషత్ సమావేశం దృష్టికి తీసుకెళ్లాను. ఎక్సైజ్ అధికారులు వేరే ప్రాంతంలో షాపును ఏర్పాటు చేయాలి.

–రొంగలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ, పాచిలవానిపాలెం

తీర ప్రాంతాల్లో సందడి

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి సందర్శకులు తరలివచ్చారు. తీర ప్రాంతానికి చేరుకున్న సందర్శకులు తిక్కవానిపాలెంలో సముద్ర తీరంలో నిర్మించిన ఎన్టీపీసీ జెట్టీదిగువన విడిదిచేసి, తీరంలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలు, పచ్చిక బయళ్లలో ఆట పాటలతో సరదాగా గడిపారు. తీరంలోని జీడి తోటలు, విడిది గొడుగుల కింద సహపంక్తి భోజనాలు చేశారు.

సాయంత్రం వరకు సముద్రంలో స్నానాలు చేసి, అలలతో సయ్యాటలాడారు. చీకటి పడిన తరువాత ఆనందంగా తిరుగు ముఖం పట్టారు.

ప్రశ్నిస్తేనే అవినీతి తగ్గుముఖం

ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు వెంకటరమణ



వెంకటరమణను సత్కరిస్తున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: బాధ్యత, విషయ పరిజ్ఞానంతో సరైన ప్రశ్నలు సంధిస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అధికార దుర్వినియోగం తగ్గుతుందని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు, ఆర్టీఐ జిల్లా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. గ్రీన్ క్లబ్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 'సామాజిక సమస్యలు – పరిష్కార మార్గాలు – ఆన్‌లైన్ వేదికలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్లో తీవ్ర జాప్యం, అవినీతి, అధికార దుర్వినియోగం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వ శాఖల సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉండాలని కోరారు. పౌరుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వ సిటిజన్ చార్టర్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి శాఖ నిర్దేశిత గడువులో సమస్యలను పరిష్కరించాలన్నారు. అధికార దుర్వినియోగం సామాజిక న్యాయానికి అడ్డుగోడగా నిలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజలు డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. న్యాయపరమైన చర్యలు కంటే ముందు సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల కోసం సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవాలన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కాండ్రేగుల సత్యనారాయణ, క్లబ్ ప్రతినిధులు పెంటకోట ఉమా మహేశ్వరరావు, బీరా వినోద్‌కుమార్, రావూరి అనిత, నైశెట్టి సత్తిబాబు, యల్లపు సూరిఅప్పారావు, మాణిక్యం ఆనంద్, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చోడవరం: ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ తైక్వాండో క్రీడలో ప్రావీణ్యం సంపాదించాలని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి అన్నారు. ఇటీవల తైక్వాండో క్రీడలో బ్లాక్ బెల్ట్ సాధించిన క్రీడాకారులను చోడవరంలో ఆదివారం ఆయన అభినందించారు. ఇటీవల తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్ టెస్టు పరీక్షల్లో చోడవరం పరిసర ప్రాంత క్రీడాకారులు పలువురు ఎంపికయ్యారు. ఈ పరీక్షల్లో సిహెచ్ వెంకటేష్, సంతోషికుమారి, ఎస్.శారద, గండి రిషిత, రాఘవ, డి.జాన్‌మార్క్ సాగర్, ఎం.హేమశ్రీ, జి.వి.శశివర్ధన్ కుమార్, వి.జస్వికరోజా, జయంత్‌లు ఎంపికయ్యారు. వీరిని అసోసియేషన్ తరఫున అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు గండి శేఖర్‌బాబు, కె.ప్రదీప్‌కుమార్ శేఖర్, సింహాచలం పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన అడిషినల్ సివిల్ జడ్జి


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి రమేష్

అనకాపల్లి: మండలంలో వెంకుపాలెం హృదయాలయ వృద్ధాశ్రమాన్ని మొదటి అడిషినల్ సివిల్ జడ్జి ఎ.రమేష్ ఆదివారం సందర్శించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి వి.నరేష్ ఆదేశాలు మేరకు ఇక్కడ ఆశ్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు ఐకమత్యంగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లపు సోమవరంలో వైద్య శిబిరం


శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో 'పల్లె పిలుస్తోంది.. రా.. కదలి రా..'కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డి.డి. నాయుడు, వైద్యులు హాజరై రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు సత్వరమే వైద్యులను సంప్రదించి సేవలు పొందాలన్నారు.

వాహన చోదకులకు జరిమానా


బయ్యవరం కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

కశింకోట: మండలంలోని బయ్యవరం కూడలిలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని 15 మందికి జరిమానా విధిస్తూ చలానాలు ఇచ్చినట్లు ఎస్ఐ పి. మనోజ్‌కుమార్ తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్టు లేకపోవడం వంటి వాహన చోదకులపై ఒక్కొక్కరికి రూ.వెయ్యి వంతున జరిమానా విధించామన్నారు. వారికి ట్రాఫిక్ నిబంధనలు వివరించి అవగాహన కల్పించామన్నారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. మురళీధర్ తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెలాఖరులోపు ప్రవేశాలు పొందవచ్చునన్నారు. కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం ఏటా జాబ్ మేళాలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. వృత్తి విద్యా కోర్సులు ఎంఈటీ, రెండేళ్ల కోర్సు, పాలిటెక్నిక్‌లో రెండో ఏడాది ప్రవేశాలు పొందవచ్చునన్నారు. దీంట్లో చేరేందుకు ఐదు శాతం సీట్లు కేటాయిస్తారన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1:	డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-2:	అందాల రాక్షసి
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-5, ఓ పాజిటివ్-14, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 213 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

వనం హీనం


అటవీ ప్రాంతం


బయ్యవరం వద్ద ఉన్న శారదా వనం


సవ్యంగా లేని వాకింగ్ ట్రాక్

- శారదా వనం అభివృద్ధిపై కూటమి నిర్లక్ష్యం
- వసతులు కల్పించకుండానే వినియోగంలోకి..
- సందర్శకుల ఆదరణ కరువు


సందర్శకులు నిరీక్షించడానికి ఏర్పాటు చేసిన పకోడా


మంచినీటి ఆర్వో ప్లాంట్

కశింకోట: నిత్య జీవితంలో తీరిక లేకుండా గడుపుతున్న ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శారదా వనం (పార్కు) అభివృద్ధికి నోచుకోవడం లేదు. 2023 డిసెంబర్‌లో బయ్యవరం వద్ద శారదా వనం (పార్కు) పనులు ప్రారంభించింది. కొంత పనులు జరిగిన తర్వాత సార్వత్రిక ఎన్నికలు వచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అరకొర సదుపాయాలతోనే దీన్ని వినియోగంలోకి తీసుకొచ్చింది. దాంతో సందర్శకుల ఆదరణ కరువవుతోంది.

వనం వెలవెలబోతోంది..

మండలంలోని జాతీయ రహదారి పక్కన అటవీ శాఖకు చెందిన 650 ఎకరాల రిజర్వు ఫారెస్టు ఉంది. ఇక్కడ 50 ఎకరాల విస్తీర్ణంలో వైఎస్సార్ సీపీ హయాంలో శారదా వనం (పార్కు) పనులు చేపట్టారు. తొలుత దీని అభివృద్ధి కోసం అటవీ శాఖ రూ.2 కోట్లు కేటాయించింది. ఈ మొత్తంతో మొదట విడతగా మంజూరైన రూ.1.40 కోట్లతో వనం అభివృద్ధి పనులు చేశారు. అటవీ వాతావరణం ప్రతిబింబించే విధంగా దాదాపు అంతటా వుడ్‌ను వినియోగించి సౌకర్యాలు కల్పించారు.

సౌకర్యాలు కల్పించకుండానే..

ఈ ప్రాంతంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపానికి సరైన పార్కు అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి పక్కన రవాణాకు సౌకర్యవంతంగా ఉన్న ప్రాంతంలో నిర్మించిన శారదా వనం రెండు నెలల క్రితం ప్రజల సందర్శనం కోసం ప్రవేశాలు కల్పిస్తూ వినియోగంలోకి తెచ్చారు. ఇక్కడ పూర్తిస్థాయిలో సౌకర్యాలు, సదుపాయాలు లేకపోవడంతో సందర్శకులు విముఖత చూపిస్తున్నారు. అంతంత మాత్రంగానే సందర్శకులు వస్తున్నారు.

అసంపూర్తిగా సౌకర్యాలు...


వినియోగంలోకి రాని దేవదార్ వుడ్‌తో నిర్మించిన ఎడ్యుకేషన్ సెంటర్ షెడ్డు

సందర్శకులు నిరీక్షించడానికి నాలుగు పకోడాలు, అటవీ శాఖ గురించి, వృక్ష, జంతు సంపద, వాటి ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కలిగించడానికి ఎడ్యుకేషన్ సెంటర్‌ను, ఆహార పదార్థాల కోసం క్యాంటీన్లను ఖరీదైన దేవదార్ చెక్కతో షెడ్లు నిర్మించారు. వాటిలో సదుపాయాలు లేకపోవడంతో వినియోగంలోకి రాని పరిస్థితి నెలకొంది. నడక కోసం చుట్టూ చదును చేసిన రోడ్డు (వాకింగ్ ట్రాక్) వర్షం వస్తే బురదమయంగా తయారవుతోంది. ఫారెస్టు లోపల అందాలు వీక్షించి ఆనందించడం కోసం డెక్ ఏర్పాటు చేశారు. ఇవి కూడా అసంపూర్తిగా ఉండి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. సందర్శకులకు మంచినీటి సదుపాయం కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి కుళాలు అమర్చి నీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. సందర్శకులకు అవగాహన కోసం గార్డెన్‌లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. వీటిలో సరుగుడు మొక్కలను పెంచి సామాజిక బాధ్యతగా వాటిని సాగు రైతుకు వెయ్యి వంతున మొక్కలను మాత్రం ప్రస్తుతం అందజేస్తున్నారు. వృక్ష జాతులపై అవగాహన కోసం టేక్, రోజ్‌వుడ్ తదితర మొక్కల పెంపకం అరకొరగా చేపట్టారు. వీటి అన్నింటికి నిధుల లేమి కారణం.

వసతులు లేక ఆదాయం రాక..


ప్రారంభం కాని క్యాంటీన్

సందర్శకుల ప్రవేశానికి నామమాత్రపు రుసుం వసూలు చేస్తున్నారు. పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10, ద్విచక్ర వాహనాలకు రూ.20, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.30 వంతున చెల్లిస్తున్నారు. వనంలో సరైన సదుపాయాలు లేకపోవడంతో సందర్శకులు తక్కువగా వస్తున్నారు. నెలకు వీరి ద్వారా రూ.5 వేలు ఆదాయం రావడం లేదని అధికారులు చెబుతున్నారు. పార్కులో అయ్యే విద్యుత్ బిల్లు రూ.7 వేలు వరకు వస్తుందని, దానికే వచ్చే ఆదాయం సరిపోవడంలేదని, ఇక అభివృద్ధి ఎలా చేస్తామంటున్నారు. దీనిలో సదుపాయాలు మెరుగుపరిచి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలంటే ఇంకా ప్రభుత్వం మంజూరు చేయాల్సిన రూ.60 లక్షలు రావలసిన అవసరం ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో సౌకర్యాలు మెరుగుపడి వనం అభివృద్ధి చెందితే మరింత మంది సందర్శకులను ఆకట్టుకొని ఆదాయం రావడానికి అవకాశం ఉందంటున్నారు. ఇందుకు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చర్యలు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిధుల వస్తేనే మిగిలిన పనులు

శారదా వనాన్ని నిర్మించి అభివృద్ధి చేయడానికి రూ.2 కోట్లు రెండేళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటగా వచ్చిన రూ.1.40 కోట్లతో అభివృద్ధి చేశాం. ఇంకా రూ.60 లక్షలు రావలసి ఉంది. అవి మంజూరైతే పూర్తిస్థాయిలో సౌకర్యాలు మెరుగుపర్చి అభివృద్ధి చేస్తాం. నెలకు సందర్శకుల ద్వారా రూ.5 వేల వరకు ఆదాయం వస్తోంది.

– కాశీప్రసాద్, సెక్షన్ ఆఫీసర్, అటవీ శాఖ, అనకాపల్లి

లింగంపేటలో కూటమిలో చీలికలు

- టీడీపీ నాయకులకు జనసేన గేలం
- మండిపడుతున్న టీడీపీ వర్గాలు
- స్థానిక ఎన్నికల్లో కలసి పనిచేసేది లేదని స్పష్టం

గొలుగొండ : లింగంపేటలో కూటమిలో వర్గపోరు పురుడుపోసుకుంది. వచ్చే స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని జనసేన, టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయి పనిచేస్తున్నాయి. లింగంపేట గ్రామ పంచాయతీ చరిత్రలో గడిచిన 20 సంవత్సరాల్లో సీపీఐ, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ నేతలు మాత్రమే ఇప్పటి వరకు గెలుపొందడం జరుగుతుంది. పలుసార్లు అయ్యన్న ఈ గ్రామంలో పర్యటించిన సందర్భంలో ఇక్కడ టీడీపీకి కనీస బలం లేకపోవడం ఇక్కడ నాయకులు ఎలా పనిచేస్తున్నారో అర్థం అవుతుందని అసహనం వ్యక్తం చేసిన సందర్భాలు అనేకం. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి వర్గపోరుతో కొట్టుకుంటున్నది. కూటమిలోని జనసేన నాయకులు సైతం రెండు వర్గాలుగా విడిపోయారు. జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ఇటీవల జనసేనలో సలాదులు ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేర్పులు చేశారు.

ఇందులో 15 మందికి జనసేన కండువాలు కప్పడం జరిగింది. కానీ వీరంతా ఎక్కువ శాతం టీడీపీ వాళ్లే. ఇది జరిగినప్పటి నుంచి లింగంపేటలో రాజకీయం వేడెక్కింది. వచ్చే స్థానిక ఎన్నికల్లో జనసేనకు అవకాశం లేకుండా టీడీపీ అభ్యర్థిని నిలబెట్టాలని ఆలోచిస్తుంది. దీంతో బలం తక్కువగా ఉన్న జనసేన టీడీపీ కంటే బలపడి టీడీపీకి అవకాశం లేకుండా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. కూటమి పొత్తు ధర్మం తప్పి టీడీపీ నాయకులను జనసేనలో చేర్చారని ఆ పార్టీ నాయకులు జనసేనపై మండిపడుతున్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కలసి పనిచేయలేమని రెండు పార్టీ నేతలు తెల్చి చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ సుమారుగా 1250 పైచిలుకు ఓట్లు ఉన్నాయి. ఇక్కడ కంచుకోటలా ఉన్న వైఎస్సార్‌సీపీ మళ్లీ వచ్చే స్థానిక ఎన్నికల్లో జెండా ఎగురవేయడం కోసం కలసికట్టుగా పనిచేస్తున్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

అనకాపల్లి: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం తక్షణమే రహదారి గోతులను పూడ్చివేయాలని సీపీఐ జిల్లా నాయకుడు వియ్యపు రాజు, ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ ఇచ్చి ఏడాది పూర్తవుతున్నా అధ్వానంగా ఉన్న రోడ్లను పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిపక్షంలో రోడ్లపై చేపలు సెల్ఫీలు దిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాదిలో ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంక్రాంతి ముందే రహదారులు మరమ్మతులు చేపడతామని చెప్పి పట్టించుకోలేదన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, మహిళలకు ఉచిత బస్సు, ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పి మోసం చేసిందన్నారు. ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏపీలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం


యోగా ర్యాలీలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

అనకాపల్లి టౌన్: ఆరోగ్యంగా జీవించాలంటే యోగా ఒక్కటే సరైన మార్గమని పతంజలి యోగా సమితి, భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు దొరమ్మనాయుడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని జార్జ్ క్లబ్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్‌లో మెయిన్ రోడ్డు మీదుగా యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చక్కటి ఆలోచన శక్తి పెంపొందిస్తుందన్నారు. అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తుందన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు ఈ నెల 21న యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు బి. మంగయ్య, బి. నరసింగరావు, మాదేటి జనార్దన్, జార్జ్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు, కార్యదర్శి బుద్ద కాశీ విశ్వనాథ్, కాండ్రేగుల చిన్న తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరకుల కోసం అవస్థలు

అచ్యుతాపురం రూరల్ : మండలంలో హరిపాలెం గ్రామ పరిధిలో పలువురు లబ్ధిదారులకు ఇప్పటికీ రేషన్ సరకులు అందలేదు. స్థానికేతరులకు ఇచ్చేశామంటూ డిపో డీలర్ చెబుతుండడంతో మండిపడుతున్నారు. కొందరిని కొండకర్ల వెళ్లి తెచ్చుకోవాలని సూచించగా.. తప్పనిసరి పరిస్థితిలో పలువురు తెచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి 50 ఇళ్లకు ఒక చోట వాహనంతో రేషన్ సరకులు అందించేవారు. రేషన్ పంపిణీ సమాచారాన్ని ముందుగా తెలియజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎవరికి ఎప్పుడు రేషన్ అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోజూ డిపో వద్ద క్యూ కట్టి వేచి ఉన్నా సర్వర్ సరిగా పనిచేయడం లేదంటూ తిరిగి పంపించేస్తున్న పరిస్థితులు తరచూ లబ్ధిదారులకు ఎదురవుతున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని ఎందరో నిరుపేద లబ్ధిదారులు ఒక్కోసారి తమ పనులు మానుకుని రేషన్ కోసం గంటల కొద్ది క్యూలో వేచి ఉండి నిరాశతో తిరుగుముఖం పట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీలర్లు ఎటువంటి షాకులు చెప్పకుండా లబ్ధిదారులకు రేషన్ అందించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఆరిపాక జెడ్పీ హైస్కూల్లో 2004-05 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

సబ్బవరం: వారంతా రెండు దశాబ్దాల క్రితం మండలంలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేసుకున్నారు. ఈ 20 ఏళ్లలో కొందరు ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి ఉన్నత స్థాయిలో స్థిరపడగా, మరి కొందరు ఉన్న ఊర్లోనే జీవితాల్ని ఆనందంగా గడుపుతున్నారు. వీరంతా ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఇందుకు వారు చదువుకున్న హైస్కూలే వేదికగా మారింది. ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, కుటుంబ స్థితిగతులను చెప్పుకుని, ఆటపాటలతో సందడి చేశారు. ఆ నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముందుగా విద్యా బుద్ధులు నేర్పిన గురువులు ఎ.సూర్యనారాయణరావు, ఎం.కామేశ్వరీదేవి, టి.దీపసుందరి, నూకరత్నంలను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు మళ్ల నాగభూషణం, సతీష్, రామకృష్ణ, త్రినాథ్, ధర్మ, దొరబాబు, లోవరాజు, శాంతి, జగదేశ్వరి, రమణమ్మ, కన్యాకుమారి, కమల, సంతోషి తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ వర్కర్లకు తల్లికి వందనం ఇవ్వాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరబాబు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న రాజాన దొరబాబు

అనకాపల్లి: తల్లికి వందనం అంగన్‌వాడీ, హాస్టల్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక కొడుగంటి గోవిందరావు భవనంలో ఏఐటీయూసీ జిల్లా సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు, వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరికి తల్లికి వందనం పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనాల వల్ల కుటుంబ పోషణ, పిల్లల చదువులు చాలా కష్టతరంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.త్రినాథ్, జిల్లా నాయకులు విత్తనాల పోతురాజు, సత్యనారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు


పైడివాడ అగ్రహారంలో ఇంటింట ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధకులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, పైడివాడ అగ్రహారం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వచ్చే నెల 10న జరగబోయే గురుపౌర్ణమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఆదివారం ప్రచారం చేశారు. ఆచార్య ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ప్రచారం జరిగింది. శ్రీకృష్ణుడిని మాత్రమే ఎందుకు జగద్గురువుగా పూజించాలో, ఆయన గొప్పతనం ఏమిటో వివరించారు. గురువు గుణాతీతుడు, గుణముల మలినం లేనివాడని కొనియాడారు. పూర్వము గురువు గుండ్రాయి లాంటి వాడు అనే నానుడి ఉండేదన్నారు. గుండ్రాయికి ఆది, అంతము ఉండవు కాబట్టే అలా పోల్చారని పేర్కొన్నారు. దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువు అనాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు దేవి, లక్ష్మి, నాగమణి, పద్మ, మహాలక్ష్మి, మంగ, అప్పారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ మార్గంలో రాళ్లు తేలిన రోడ్డు


దాలివలస కెనాల్ మార్గంలో రాళ్లు తేలిన ప్రాంతం

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల గుండా ఉన్న రైవాడ కెనాల్ మార్గం వెంబడి ఉన్న గ్రావెల్ రోడ్డు మార్గం అధ్వానంగా మారింది. గతంలో నిర్మాణం చేపట్టిన మట్టిరోడ్డు మార్గంలో ప్రస్తుతం రాళ్లు తేలి ఉండడంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణం చేసే సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉగ్గినవలస, ఆర్.వై. అగ్రహారం, కొరువాడ, డి.అగ్రహారం, గవరపాలెం, దాలివలస, రామచంద్రపురం, కె.కె.అగ్రహారం గ్రామాల గుండా ఈ కెనాల్ మార్గాన్ని ఆనుకొని సమీప గ్రామాల ప్రజలు రాకపోకలు చేసేందుకు గ్రావెల్‌రోడ్డును నిర్మాణం చేపట్టారు. ఈ గ్రావెల్‌రోడ్డును నిర్మాణం జరిపి నేటికి సుమారు 20 ఏళ్లు పైబడి కావస్తుంది. ఈ కెనాల్‌ను ఆనుకొని ఉన్న గ్రావెల్ రోడ్డు మార్గం గుండా వాహనాలు రాకపోకలు సాగించడంతో పాటు, వర్షాలు పడే సమయంలో రోడ్డు పైభాగంలో గ్రావెల్ తొలగిపోవడంతో అడుగున గల మెటల్ రాళ్లు బయటకు తేలాయి. రాళ్లు తేలిన రోడ్డు మార్గం పక్కగా కెనాల్ గుండా నీటి ప్రవాహం జరగడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ఎదుర్కోవాల్సి వస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ మట్టిరోడ్డు మార్గంలో పెద్ద పెద్ద గోతుల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో గోతుల పరిస్థితిని గుర్తించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాళ్లు తేలిన మార్గాన్ని జీవీఎంసీ అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పంచగ్రామాల భూసమస్యకు మూల కారణం చంద్రబాబే

- ఏడాది దాటినా పరిష్కరించని కూటమి ప్రభుత్వం
- సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆందోళన


ధర్నాలో మాట్లాడుతున్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం కార్యదర్శి కృష్ణంరాజు

సింహాచలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించలేదని సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం విమర్శించింది. పంచగ్రామాల భూసమస్య పరిష్కారం కోసం సింహాచలంలో సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆదివారం ధర్నా చేసింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ ఆధీనంలోనే రెవెన్యూ, ఎండోమెంట్ శాఖలు ఉంటాయని, ఈ రెండు డిపార్ట్‌మెంట్లతో ప్రభుత్వం చర్చిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ భూసమస్య రావడానికి అసలు కారణం టీడీపీ ప్రభుత్వమే అని దుయ్యబట్టారు. 1996-97 మధ్య అప్పటి సీఎం చంద్రబాబు హయాంలోనే పెందుర్తి, చినగదిలి ఎమ్మార్వోలు సింహాచలం దేవస్థానానికి రైత్వారీ పట్టాలు ఇవ్వడంతో సమస్య ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి పంచగ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే 2019లో ఇచ్చిన జీవో నెం.229ను అమలు చేస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ మాట ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు సమస్య కోర్టులో ఉందని, కోర్టు తీర్పు రాగానే పరిష్కారం చేస్తామని మభ్యపెడుతున్నారని విమర్శించారు. సమస్య పరిష్కారం అయ్యేలోపు ఇళ్ల రిపేర్లు, నిర్మాణాలు చేసుకునేందుకు ఖచ్చితంగా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీబీఎస్ ప్రతాప్, రమణి, గోపాలకృష్ణ, రామారావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై నిఘా

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ స్వామినాయుడు అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుపాలు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.